క్లుప్తంగా

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీవీఈఓ వెంకటరమణనాయక్

కుందుర్పి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి(డీవీఈఓ) వెంకటరమణనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించిన డీవీఈఓ అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి భావిభారత పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, అధ్యాపకులు పాల్గొన్నారు.

దిక్సూచిలా మ్యాప్ రీడింగ్



క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూడేరు: దేశ సరిహద్దుల్లో సైనికులకు మ్యాప్ రీడింగ్ ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లడానికి, గుర్తించడానికి దిక్సూచిలా పని చేస్తుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ జోబె పిలిప్ అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 9 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ–9వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. బుధవారం క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్ పై అవగాహన కల్పించారు. ఎత్తయిన కొండలు, పర్వతాల్లో ఎంచుకున్న గమ్యానికి ఏవిధంగా చేరుకోవాలి? శత్రువులపై ఏవిధంగా దండెత్తాల్లో ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు శ్రీప్రియ, ఎర్రమ్మ, సోమశేఖర్ నాయుడు, కునిందర్ కుమార్, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.


స్టాక్ పాయింట్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాస్

ఉరవకొండ: స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయ అవరణలో ఉన్న స్టాక్ పాయింట్‌ను గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, డిప్యూటీ తహసీల్దార్ బోగన్నగౌడ్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ మండలాలకు ప్రతి నెలా ఎంత రేషన్ సరఫరా అవుతుందో ఆరా తీశారు. స్టాక్ పాయింట్‌లో అవకతవకలు చోటు చేసుకుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా సక్రమంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



మంగంపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

శెట్టూరు: మంగంపల్లి వద్ద గుర్తుతెలియని దుండగులు విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగితీగను ఎత్తుకెళ్లారు. వివరాలు.. యాటకల్లు గ్రామానికి చెందిన రైతు పాతన్నకు చెందిన పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను ఎత్తుకెళ్లారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నామన్ని, ఇలా వాటిని ధ్వంసం చేస్తే ఎలా బతకాలని రైతు వాపోయాడు. మండలంలో ఇటీవల వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీతాఫలం వేలం



వేలంపాటలో పాల్గొన్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

రాయదుర్గం: మండలంలోని మెచ్చిరి గ్రామ సమీపంలోని అనుపకొండలోని సీతాఫలం చెట్లను బుధవారం సర్పంచ్ ఊలేమ్మ అధ్యక్షతన రచ్చకట్ట వద్ద వేలం పాట నిర్వహించారు. కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి మురళీకృష్ణ హాజరయ్యారు. రాయదుర్గానికి చెందిన వన్నూర్‌స్వామి వేలం పాటలో కొండను దక్కించుకున్నారు.



ఉచిత ప్రయాణానికి నోచుకోని బళ్లారికి వెళ్లే అంతరాష్ట్ర సర్వీసు



బస్సుల కొరత, ఆంక్షల కారణంగా ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

పేరుకే ఉచిత బస్సు

- ఆంక్షలు, బస్సుల కొరతతో మహిళల ఇక్కట్లు
- రాయదుర్గం డిపో పరిధిలో కేవలం రెండు సర్వీసుల్లోనే 'స్త్రీ శక్తి'
- అంతరాష్ట్ర సర్వీసుల్లో కనీసం ఆంధ్రా సరిహద్దు వరకూ ఉచితం కరువు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు హామీ కేవలం మాటల గారడీలా మారింది. ఆంక్షల కారణంగా సరిహద్దు ప్రాంత మహిళలు ఉచిత ప్రయాణానికి నోచుకోవడం లేదు. అలాగే కేవలం 5 సర్వీసుల్లో మాత్రమే అవకాశం కల్పించినా రాయదుర్గం డిపో పరిధిలో మూడు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అందులోనూ సూపర్ లగ్జరీని పక్కన పెడితే ఇక మిగిలిన రెండు (ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు) సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం వర్తించడం గమనార్హం. బస్సులు, సర్వీసుల కొరత, పథకానికి ఆంక్షల కారణంగా రాయదుర్గం డిపో పరిధిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తుస్సు మంటోంది.

సరిపడా బస్సులు ఏవీ?

రాయదుర్గం డిపో పరిధిలో మొత్తం 66 ఆర్టీసీ బస్సులుండగా వీటిలో 13 సూపర్ లగ్జరీ, 21 ఎక్స్‌ప్రెస్, 32 పల్లెవెలుగు బస్సులున్నాయి. రాయదుర్గం నుంచి వివిధ ప్రాంతాలకు 55 సర్వీసులు నడుపుతున్నారు. వీటిలోనూ సూపర్ లగ్జరీ, అంతరాష్ట్ర సర్వీసులు మినహాయిస్తే కేవలం 30 సర్వీసుల్లో మాత్రమే మహిళలు ప్రయాణించే అవకాశం ఉంది. డిపో పరిధిలో రోజూ మహిళలు ప్రయాణించే నిష్పత్తిని బట్టి చూస్తే మరో 15 బస్సులు అవసరం ఉంటుందని ఆర్టీసీ ఉద్యోగ యూనియన్ ప్రతినిధులు చెబుతున్నారు.

17 అంతరాష్ట్ర సర్వీసుల్లోనూ నిరాశ

సరిహద్దు ప్రాంతం కావడం రాయదుర్గం నుంచి కర్ణాటకలోని ప్రాంతాలకు ముఖ్యంగా 50 కిలోమీటర్ల దూరంలోని బళ్లారికి అత్యధిక ఆంధ్రా సర్వీసులు నడుస్తున్నాయి. కణేకల్లు, రాయదుర్గం నుంచి దాదాపు 17 సర్వీసులు బళ్లారికి వెళుతున్నాయి. 50 కిలోమీటర్ల ప్రయాణంలో రాయదుర్గం. డీ.హీరేహాళ్ మండలాలకు చెందిన గ్రామాలు దాదాపు 35 కిలోమీటర్ల మేర సరిహద్దు వరకూ ఉంది. తర్వాత ఓబుళాపురం చెక్‌పోస్టు నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో బళ్లారి వస్తుంది. కానీ వీటిలో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి లేదు. కర్ణాటక రాష్ట్రంలో ఆ రాష్ట్ర బస్సుల్లో సరిహద్దు స్టాప్ వరకు మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంది. కానీ ఆంధ్రాలో అంతరాష్ట్ర సర్వీసుల పేరిట ఆంక్షలు విధించడంతో మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతరాష్ట్ర సర్వీసుల్లో సరిహద్దు స్టాప్ వరకు ఉచిత బస్సు కల్పించనప్పుడు ఈ పథకం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు.

పుణ్యక్షేత్రాలకు వెళ్లే బస్సుల్లోనూ...

ఉచిత ప్రయాణ పథకంతో పుణ్యక్షేత్రాల దర్శనం కోసం వెళ్లవచ్చని ఎంతో ఆశ పడిన మహిళలకు రాయదుర్గం డిపో పరిధిలో నిరాశ మిగిలింది. రాయదుర్గం పట్టణం నుంచి తిరుపతి ఒక సర్వీసు, శ్రీశైలంకు ఒక అంతరాష్ట్ర సర్వీసు అందుబాటులో ఉంది. ఈ రెండింటిలోనూ స్త్రీ శక్తి పథకం అమలు లేదు. తిరుపతికి సూపర్ లగ్జరీ , శ్రీశైలంకు అంతరాష్ట్ర సర్వీసు కావడం ఉచిత ప్రయాణానికి ఆంక్షలు అడ్డువుతున్నాయి. ఒక వేళ తిరుపతికి వెళ్లాలంటే అనంతపురం చేరుకొని, అక్కడి నుంచి మదనపల్లికి వెళ్లి తిరుపతి వెళ్లాల్సిన దుస్థితి ఉంది.

పల్లెలకు బస్సులు కరువు

నష్టాలను సాకు చూపుతూ మండల కేంద్రాలతో పాటు అనేక పల్లెలకు బస్సు వసతి లేదు. ముఖ్యంగా రాయదుర్గం కేంద్రం నుంచి గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండల కేంద్రాలకు ఒక్క బస్సు కూడా నడపడం లేదు. నష్టాలు, బస్సుల కొరత పేరుతో నడపకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఆంక్షలు ఎత్తేయాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి. ఆంక్షలతో కొన్ని బస్సుల్లోనే ప్రయాణాన్ని పరిమితం చేయడం సబబుకాదు. రాయదుర్గం నుంచి బళ్లారికి వెళ్లే బస్సుల్లో ఓబుళాపురం చెక్‌పోస్టు వరకు ఉచిత ప్రయాణం కల్పిస్తే ప్రయోజనంగా ఉంటుంది. ఎలాంటి ఆంక్షలు లేకుండా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి.

– లత, రాయదుర్గం, ప్రయాణీకురాలు

మహిళలను మోసం చేయడమే..



స్త్రీశక్తి పథకం పేరిట ఉచిత బస్సు ప్రయాణమంటూ ఊరించి ఆంక్షలతో కొన్ని సర్వీసుల్లోనే ప్రయాణాన్ని పరిమితం చేయడం అంటే మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేయడమే. రాయదుర్గం డిపో పరిధిలో బస్సుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అందులోనూ 12 సర్వీసులు సూపర్ లగ్జరీలు ఉన్నాయి. మరోవైపు అంతరాష్ట్ర సర్వీసుల్లో ప్రయాణం లేదు. ఇవన్నీ చూస్తే ఉచితం పేరుతో కూటమి ప్రభుత్వం డ్రామా ఆడుతోందని అర్థమవుతోంది.

– ఉషారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దు

రాయదుర్గంటౌన్: పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఇబ్బందులు పెట్టడం సరికాదని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బోగస్ పింఛన్లను రద్దు చేయడంలో ఎలాంటి తప్పులేదని, కానీ అర్హులు నష్టపోకుండా న్యాయం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలనతో వేలాది మంది దివ్యాంగుల పింఛన్లను నిలుపేదల చేశారని, తక్షణం ప్రభుత్వం స్పందంచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పీలు చేసిన దివ్యాంగ పింఛన్‌దారుల పరీక్ష కోసం వైద్యులనే ఇళ్లకు పంపించాలన్నారు.

శుభకార్యం



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాల్యం ఆంజనేయులు కుమార్తె శివగంగ వివాహం బుధవారం పెన్నహోబిలంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో యువ నాయకుడు వై.నిఖిల్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధక్షుడు సీపీ వీరన్న, విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి, భరత్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు సుంకన్న, మండల కన్వీనర్ కురుబ రమేష్, ఉప కన్వీనర్ బోయ నాగేంద్ర, మాజీ సర్పంచ్ సీనియర్ నేత కరణం భీంరెడ్డి, సర్పంచులు ఉమాశంకర్, మాధవరెడ్డి, అశోక్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, హేమంత్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు: మండలంలో వరద ముంపునకు గురైదెబ్బతిన్న వేరుశనగ పంటలను రాయదుర్గం ఏడీఏ పద్మజ, కళ్యాణదుర్గం కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు శిరీష, హరిణి, యుగంధర్, కణేకల్లు ఏఓ జగదీష్ బుధవారం పరిశీలించారు. గరుడచేడు, మీన్లహళ్లి, బిదరకొంతం గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు వరద ముంపుకు గురై వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. ఈ పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి పూర్తిగా దెబ్బతిన్న రైతుల వివరాలను సేకరించారు. పూర్తిగా దెబ్బతిన్న పంటలపై నివేదికను రూపొందించి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు ఏడీఏ తెలిపారు. పాక్షికంగా దెబ్బతిన్న వేరుశనగ పంటను ఏ విధంగా కాపాడుకోవాలో రైతులకు సలహాలు, సూచనలిచ్చారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



సూచనలిస్తున్న వైద్యాధికారిణి ఉషారాణి

కూడేరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి ఉషారాణి ప్రజలకు సూచించారు. బుధవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం రోగులు అధికంగా వచ్చారు. డాక్టర్ ఉషారాణి వారికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాలుతో గొంతు నొప్పి, దగ్గు , శ్వాసకోశ సంబంధిత సమస్యలు, ఒళ్లు నొప్పులు, దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, నీరు కలుషితం కావడం ద్వారా టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని తెలియజేశారు. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. మాస్కులు ధరించాలన్నారు. జర్వం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకుని చికిత్స పొందాలన్నారు. జాగ్రతలు తీసుకోకపోతే ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు.

వైభవంగా బీబీ జైనబ్బీ గంధం వేడుక



అమ్మవారి గంధం ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండలోని హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గంధం వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. స్థానిక అల్లప్పరెడ్డి ఇంటి నుంచి విశేష పుష్పాలు, ముత్యాలతో అలంకరించిన హంస వాహనంపై అమ్మవారి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు చేర్చారు.జిల్లా నలమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిక్కిరిసాయి. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, కోశాధికారి జెండా జిలాన్, ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాద్, గంగవరం శర్మాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పామిడి జాకీర్ పాల్గొన్నారు.

గంధం ఊరేగింపు

వజ్రకరూరు: మండల కేంద్రంలో భక్తుల కొంగు బంగారం హజరత్ సయ్యద్ మురాద్ షావలి ఉరుసు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గ్రామ వీధులగుండా గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయానికి చేర్చారు. గురువారం ఉరుసు, శుక్రవారం జియారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మెరిట్ లిస్టు ప్రకటించరా?

కూడేరు: డీఎస్సీ అభ్యర్థుల లిస్టు ప్రకటించకుండా అభ్యర్థులకు మెసేజ్ ద్వారా తెలిపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఏమిటని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నేరుగా అభ్యర్థి సెల్‌కు మెసేజ్ పంపితే వారి మెరింట్ స్థానం ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు డీఎస్సీ పరీక్షను పక్కాగా నిర్వహించి టీచర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేశాయని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వ అసమర్థతతో డీఎస్సీ పరీక్ష నిర్వాహణలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు.

వైభవంగా ఆదిచెన్నకేశవుడి రథోత్సవం



రథానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో బుధవారం జరిగిన ఆదిచెన్నకేశవ స్వామి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి రథానికి పూజలు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకులు, అధికారులు ఎమ్మెల్సీకి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. భక్తులు రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు వేలాదిగా రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర, మాజీ సర్పంచ్ ఉన్నం మారుతి, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంచర్ల లాలెప్ప, ఆలయ ఈఓ అంగదాల క్రిష్ణయ్య, క్లర్క్ లాలేష్, పాల్గొన్నారు.

నేడు వసంతోత్సవం

ఆదిచెన్నకేశవ స్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం స్వామికి అభిషేకం, పల్లకీ సేవ, వసంతోత్సవం జరుగుతాయి. రాత్రి 8 గంటలకు భూదేవి, లక్షుమమ్మ దోపులు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అంగదాల క్రిష్ణయ్య తెలిపారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



యూరియా ఇవ్వాలని వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు



కూడేరులో యూరియా కోసం క్యూకట్టిన రైతులు

కుందుర్పి: రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతూ కుందుర్పి, అప్పిలేపల్లి గ్రామాల్లో బుధవారం ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయా కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచులు రామ్మూర్తి, అతావుల్లా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, వార్డు సభ్యుడు మంజు, నరేష్ ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన లేదన్నారు. రూ.250 ధర ఉన్న యూరియాను కర్ణాటక తదితర ప్రాంతాల్లో రూ.4 వందలు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు మంజునాథ్, రెడ్డయ్య, కిష్టప్ప ,వీరన్న, నల్లమల్లప్ప, సిద్దలింగ తదితరులు తెలిపారు. యూరియా ఇవ్వకపోతే అన్ని వ్యవసాయ కార్యాలయాల ముందు ఆందోళనలను చేపడుతామని తెలియజేస్తూ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

నో స్టాక్

కూడేరు: యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. బుధవారంముద్దలాపురం, కూడేరు రైతు సేవాకేంద్రాల పరిధిలోని రైతులకు వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేశారు. బస్తా రూ.267లుతో పాసు పుస్తకానికి రెండు బస్తాలు చొప్పున 280 బస్తాలు స్టాక్ ఉంటే 140 మంది రైతులకు ఏఈఓలు దిలీప్ కుమార్, రాఘవేంద్ర అందజేసి బంద్ చేశారు. తర్వాత చాలా మంది రైతులు యూరియా కోసం వచ్చి నిరాశతో వెనుదిరిగారు. మండలానికి ఇంకా యూరియా కావాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపామని అధికారులు చెబుతున్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ జయప్రకాష్, వీఏఏ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ

కణేకల్లు: యూరియా పారదర్శకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్య ఎంపీఈఓలు, వీఏఏలను ఆదేశించారు. మండలంలోని బెణికల్లు, బ్రహ్మసముద్రం గ్రామాల్లో బుధవారం యూరియా పంపిణీని ఏఓ జగదీష్‌తో కలిసి పరిశీలించారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి రైతుకూ యూరియాను అందించాలన్నారు. స్టాక్, డిమాండ్‌ను అనుసరించి ఒకటి లేదా, రెండు బస్తాలను పంపిణీ చేయాలన్నారు. సమస్యలు రాకుండా చూడాలన్నారు.

సంక్షిప్త సమాచారం

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

కళ్యాణదుర్గం రూరల్: ఈనెల 23 నుంచి 25 దాకా ఒంగోలులో జరుగునున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజవర్గ కార్యదర్శి గోపాల్ కోరారు. బుధువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల అమల్లో విఫమైందని విమర్శించారు. రాష్ట్ర మహాసభలకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పర్యావరణానికి మొక్కలే మూలాధారం

బెళుగుప్ప: ఆవులెన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ప్రస్తుతం నక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు యు.శ్రీనివాసులు బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి మొక్కలే మూలాధారం అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు కృషి చేయాలని కోరారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులకు చెక్

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణీ శ్రీలక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దోమలు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, దోమలపై దండయాత్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఓ ఈశ్వరయ్య, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మెలకువలతో అధిక దిగుబడులు

వజ్రకరూరు: పంటల సాగులో మెలకువలు పాటించి మంచి దిగుబబడులు సాధించాలని వ్యవసాయశాఖ ఏడీఏ సత్యానారాయణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు నారాయణస్వామి, లక్ష్మీకళ్యాణి, వెంకటరమణ తదితరులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలోమండల వ్యవసాయ అధికారి మధుకర్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ–క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం వజ్రకరూరు పరిసర ప్రాంతంలో రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధుకర్, ఆర్ఎస్‌కే సిబ్బంది ఇందు, బొలికొండ పాల్గొన్నారు.

ఘనంగా ఉట్లమాను పరుష



అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉట్లమాను పరుష నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి ఉట్లమాను వరకు ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పింఛన్.. టెన్షన్



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం

రాయదుర్గం: దివ్యాంగులకు పింఛన్ టెన్షన్ పట్టుకుంది. ప్రభుత్వం చాలా మంది దివ్యాంగులకు నోటీసులు జారీ చేయడంతో లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. అర్హులమని నిరూపించుకునేందుకు కార్యాలయాల చుట్టు తిరుగుతూ తంటాలు పడుతున్నారు. బుధవారం రాయదుర్గం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందించేందుకు క్యూకట్టారు. ఈ విషయంపై ఎంపీడీఓ కొండన్న మాట్లాడుతూ.. అర్హత కలిగిన వారందరికీ తప్పక పింఛన్ అందిస్తామన్నారు.

చలో కలెక్టరేట్‌కు తరలిరండి

బెళుగుప్ప: అర్హులైన దివ్యాంగులకు నోటీసులు ఇచ్చి పింఛన్లు తొలగించేందుకు కుట్రలు పన్నుతున్న ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు గురువారం చేపట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా సహాయ కార్యదర్శి బోయ రాజేష్ బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. దివ్యాంగులు ఎవరూ అధైర్యపడకుండా సమష్టిగా పోరాటం సాగించి మన హక్కులను కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. దివ్యాంగులందరూ అర్హత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ వద్దకు చేరుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ఒంటిమిద్ది గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బెళుగుప్ప మండలం యలవలంక గ్రామానికి చెందిన వన్నూర్‌స్వామి బైక్‌పై ఒంటిమిద్ది గ్రామం వైపు బయలుదేరాడు. అదే సమయంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొంది. ఘటనలో వన్నూర్‌స్వామి కాలు విరిగింది. స్థానికులు వెంటనే అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బ్రహ్మసముద్రం : బొమ్మగానిపల్లిలో విద్యుదాఘాతంతో బుధవారం ఓ గేదె మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు..రైతు పూజారి శ్రీనివాసులుకు చెందిన గేదె బుధవారం మేత కోసం బయటకు వదిలిపెట్టారు. మారెమ్మ గుడి వద్ద ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగానే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడి ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. ఇదిలా ఉండగా సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు పక్కనే ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.